# - వరదలు -

★



రచన : శ్రీ కె. అంజయ్య

మంటలు, మంటలు.

నీళ్ళలో పెట్రోల్ పోసి మండించినట్లుగా బాధలతో, ఆక్రోశాలతో బాధాతప్తుల నోళ్ళలోంచి లేచిన హా...హా...కారాల మంటలు.

పోయినేడు వానల్లేక, ఈయేడు వానలు మండిపడగా కష్టాల్లోపడ్డది జనం. పోయినేడు పెళ్ళాం నీళ్ళాట కెళ్ళిందంటే, రాగానే ఇటు కొడుకునీ, అటు పెళ్ళాన్నీ సర్దిపుచ్చాలి, సవరించాలి, లాలించాలి, ఆలించాలి, పాలించాలి.

పోయినేడు మంచము మొకము చూడబుద్ధి కోకాడికి ఈయేడు ఇడనబుద్ధి కావడంలేదు. పోయినేడు తీరని (కామ) దాహంతో కొట్టుమిట్టాడి బజారుపట్టి ఆడ్‌తీరక ఆసుపత్రిలోపడితే, ఈయేడు బలానికి ఉన్నది ఊడిపోకుండా ఉండడానికి మందులు వాడాల్సొస్తుంది దొందూ దొందే.

తీపి తినబుద్ధయితే ఎంతని తినగలడు. కిలోలకు కిలోలు తినలేడుగా? అజీర్తివేస్తుంది, అనారోగ్యం కలుగుతుంది. అంతే...అన్నీ అంతే!

బీదోనికి, కటిక పేదోనికి గుర్తు ఎల్లయ్య. అతని కుటుంబము, బోరున కురుస్తున్న వానకు ఎల్లయ్య గుండెల్లో 'సైరన్లు' మోగినయి. సైరన్లకంటే ముందే గుడిసెముందు బురదకాలువ.

చటుక్కున మెరిసిన మెరుపుకు పూరిగుడిసెలవాడ గోడుగోడున ఏడుస్తున్నట్లు కన్పించింది. ఎగిసి వస్తున్న తుఫానుకు గుంటలు బురదతో నిండాయి, గుడిసెలు నేలలో కొదిగి, నీళ్ళతో నిండాయి. బురదగుంటలు, గుడిసెలు నేనంటే నేనని ఇంకా పోటీగా నిండుతున్నాయి.

'గంగమ్మ గట్లు తెంచుకుని గరీబోళ్ళ ముంచెతందుకొచ్చిందనుకున్నాడు' ఎల్లయ్య. పెళ్ళాం, కొడుకునూ లేవదీసి రోడ్డునపడ్డాడు. 'నిన్న తెంచుకున్న గింజలు నేడు అక్కరకు రాకుండాపోయె' అని మనసులో గింజుకున్నాడు. ఎల్లయ్య రోడ్డున పడ్డాడో లేదో తప్పున కూలింది గుడిసె కప్పులా. ఓమారు గొల్లుమంది ఎల్లయ్య గుండెలోని పొర. ఎల్లయ్య కొడుకు పేరుకు సుబ్బన్న కాని అగ్గిపుల్లలాంటివాడు, రాపిడి తగిలిందా బగ్గున మండిపడేవాడు.

ఎల్లయ్య పెళ్ళాం మల్లమ్మ ఒట్టి వెర్రిబాగుల సుబ్బమ్మ.

చెట్లకుచెట్లు నేలకూల్చుతూ, గట్లకుగట్లు తెంచుతూ రివ్వున వస్తుంది తుఫాన్. గత్తైనా లేని చెట్లకింది ప్రజలు నీళ్ళలోమునిగి తేలుతున్నారు. ఆత్మహత్యకు పూనుకుందామనుకున్నవానికి ఆయుధం అవసరము లేకపోయింది, పెనం మది నీరులా హృదయాల్లోని ఆశ అంతకంతకీ ఆవిరై పోతుంది.

మోకాళ్ళబంటి నీళ్ళల్లో, మోర్రుదొప్పు వానలో నడుస్తున్న ఎల్లయ్య పెళ్ళాం కుప్పలా కూలిపోయింది, అసలు వల్లమ్మ పడలా, ఆమెను నేలకు తొక్కింది పక్కనున్న చెట్టు. అగ్గి నెట్టైంగా నిండైన మనిషి ఎల్లయ్య, కొడుకు అగ్గిపుల్లల గుండెపొరలు చీలిమండినాయి, పడుతున్న వానను బూతులు తిట్టారు.

కన్నతల్లిని చూద్దామనుకున్న కొడుక్కు కడసారి

చూపు దక్కలేదు. కట్టుకున్న పెళ్ళాం ఎల్లయ్య కంటికి కన్పించలేదు, తండ్రీకొడుకుల ఏడుపు, కంటికి నీళ్ళు రాలేదు, ఆనీళ్ళు అంతకుముందే ఆవిరయ్యాయి.

'నేడీ వరద రాకుంటే తాను ఈనరకు నాగలి కట్టేటోడే, పల్లమ్మ చేన్లో నడుమొంచేదే, అగ్గిపుల్ల బళ్ళో ఆటలాడేటోడు' అనుకున్నాడు ఎల్లయ్య, వారి నేడు పెళ్ళామెక్కడో మొగుడెక్కడో తల్లెక్కడో పిల్లాడెక్కడో.

అరుపులు, అరుపుల సెగలు, ఒకరికై ఒకరు అరుపులు, ఒకరికై ఒకరి ఆరాటాలు. ఓదిక్కు ప్రాణంతో కొట్లాట, మరోదిక్కు తమ తోడుగా జీవించిన ప్రాణులకై వెతుకులాట. గుడిసెలు కూలిపోయాయి, గుండెల్లో ఆశలు మండిపోయాయి, అగ్గిపుల్ల మెదడులో ఆలోచన చక్రన మెరుపులా మెరిసింది.

'అయ్యా! ఊరవతలి బంగళాకు పోదామా' అగ్గిపుల్ల అందించిన ఆశారేఖతో అందరిలో మళ్ళీ ఆశ నిల్చింనగ? పదండి, పదండి బంగళాకని గోళలు లేచాయి, కాళ్ళు కదిలాయి. అది బంగళా, ఆ ఊరికల్లా అందమైన బంగళా. అధునాతనపు ఖిల్లా, చుట్టూరా ప్రహరీగోడ. ఖిల్లాముందు రక్తాన్ని కళ్ళచూసే అల్సేషియన్ బంట్లు. కండల్లో రక్తాన్ని కొల్లగొట్టి, పచ్చగా ఎదిగిన మనిషి పారేసిన బొక్కలు కంకి దుక్కల్లా బలిసిన కుక్కలు.

బంగళా చుట్టురా అందమైన నందనవనము. రకరకాల మొక్కల ప్రమదావనం. అందంగా మొక్కల రెక్కలు కత్తిరించి, మెడలు వంచి ఉంచిన బానిసతను ఆ బంగళాలో ఉన్నోడికి కళ్ళముందు భూతల స్వర్గం, లేనోడికి చుట్టూరా కంపుగొట్టునరకం, అందుకే అది అందని నిచ్చెనైనా అందుకో బుద్ధేస్తుంది.

ఏ పారస్ రాజకుమారుని భవనంలోని ఓముక్క ఇక్కడొచ్చి కూలిందా అన్నట్లుగుందది, అందులోన మనుషులకు అందరూ చూపు కానరు. అంతా (లేనోళ్ళంతా) క్రిమి కీటకాలలాగుంటారు, వాళ్ళను చూస్తే కళ్ళకు ముళ్ళు ఏమైనా అంటుకలవని కంటికి అద్దాలెక్కించారు, అదీ స్తోమతును గుర్తెన్నారు, చావుకేకలు, గావుకేకలు, ఆత్మీయులకై ఆరాటాల కేకలు, కేకల వరదలు, కేకల వెల్లువలు, (ఇదే మనుషుల గోలైతే పశువుల గోల చావులేదు).

ఆ అందమైన బంగ్లాను చేరారు, అగ్గిపుల్ల, ఎల్లయ్య. అగ్గిపుల్ల, ఎల్లయ్యలాంటి జనం, లోపలికి పరుగెత్తి తలదాచుకుందామన్న ఆరాటము, వరద ఆగే




శాంతి డైమండ్స్

రసాయనిక వజ్రాలను తయారించుటలో

ప్రసిద్ధి చెందియున్నాము.

వివరములకు :—

బి. కె. ఎన్. కన్నన్ & బ్రదర్స్

నెం. 37, పెద్ద సౌరాష్ట్ర వీధి : తిరుచిరాపల్లి-620008.

వరకే ప్రాణాలు నిలుపుకోవాలన్న పోరాటము, కళ్ళ ముందు బెదురు బొమ్మల్లా చిన్న అందమైన కుటీరాల్లో చందమామలాంటి తెల్లని పక్కలు ఎవడి రక్తము కళ్ళ అని ఊగిసలాడుతున్న పక్కలు పాపం! ఆ దొంగలకు తెలియ్యేట్లు లేదు. తెలిసినా లేవబుద్ధి లేదో. చక్కని నెచ్చెలి పక్క వదలనీయలేదో, మందుకొట్టిన మెదడు బద్ధకించిందో.

దుక్కల్లాంటి పక్కల చెదిరింపుకు జనం తికమకలో ఊగిసలాడింది, చెదురు బద్దల్లాంటి అగ్గిపుల్ల ఆవేశపు చేతులు చప్పున గేటువైపుకు దూసుకపోయాయి, ఓవైపు ఆంబోతుల్లా బలిసిన పక్కలు, వరోవైపు పలుగువాడు లాంటి మనిషి, ఘర్షణలో నెత్తురు ఒలికింది.

అగ్గిపుల్లకు సాయంగా అగ్గిపెట్టె కణకణమండే నిప్పు రవ్వలాంటి ఆవేశపు జనం తోడయింది, దుక్కలు దిక్కులు పిక్కటిల్లేలా ఓండ్రపెట్టాయి, అంతా జనం అనుపుల్లో కలిసింది, నెత్తురు తాగి బలిసిన పక్కలు నెత్తుటి మడుగులో ఓలలాడాయి, మేక వెనుక పులిలా గురుగెత్తుకొస్తున్న వరదలు, నెత్తిపై జల్లులు, నెత్తుటి బట్టలో పొడుచుకు వస్తున్న సూరీడులా అగ్గిపుల్ల, తోడుగా జనం.

అంతవరకూ అన్నేళ్ళదాకా కొట్టకొనకు ఎక్కడో దాక్కున్న ధైర్యము ముందుకొచ్చింది. చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్టైన గుండెబలం నిండుగా ఒకచోట నిండింది. ఒకేసారి తలుపులపై వేయిచేతులు, వేలాది చేతులు. చేతుల కలయికలు, కలయికల చేతలు, అంతే అంతవరకూ తలుపుల నంటిపెట్టుకునివున్న గొళ్ళాలు పుటుక్కుమన్నాయి. అంతవరకూ ఉక్కుముక్కల్లా దృఢమైన వనుకున్న తలుపులు ముక్కలై పక్క కొదిగాయి.

పక్కలపైనుండి ఆలజడికి లేచిన దొరలు చేతనావస్థను చూచి అచేతనంగా పడిపోయారు.


# శుభవార్త!!

## "ఎస్" బీడీల ఎగుమతి




కెనడా, స్విట్జర్‌లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు అనేక దేశాలకు మెస్సర్సు ఎ. హబీబుర్ రహమాన్ అండ్ సన్సు గుడియాత్తంవారు ఉత్పత్తి చేయు 'ఎస్' బీడీలు ఎగుమతి ఔతున్నాయి. అంతేకాదు. అనేక ఇంటర్నేషనల్ ఫేర్సులో వీటిని ప్రదర్శనమునకు పెట్టారు. జర్మని (లిప్‌జిగ్ ఫేర్) స్వీడన్, బెల్జియమ్, సింగపూర్ మున్నగు దేశాలలోనే కాక, అనేక ఆఫ్రికన్ దేశాలలోని ప్రదర్శనాల లోకూడా వీటిని ప్రవేశ పెట్టారు. 'ఎస్' బీడీలను వారు తయారుచేసిన 20 శాల్తీలు గల సిగరెట్ పెట్టెవంటి పాకెట్‌లో కొత్త రూపు, అందచందాలుకూడా ఏర్పడ్డాయి.

ఆద్యాంతన భవిష్యత్తులో అమెరికా, యూరోపు ఖండాలలో నాగరిక ప్రజలలో సైతం అభిమానులను పెంచుకొని 'ఎస్' బీడీ సుస్థిరమైన స్థానం ఆక్రమించగలదను నమ్మిక ఏర్పడ్డది, ప్రాచ్య ప్రాశ్చాత్య దేశాలలో లభించిన విశేష ప్రోత్సాహం దానిని దృఢపరుస్తుంది.